క్లుప్తంగా

బోర్‌వెల్‌కు మరమ్మతు



మరమ్మతు చేయించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

లింగాపూర్: మండలకేంద్రంలో మరమ్మతులకు నోచుకోని బోర్‌వెల్‌పై సాక్షి కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. పంచాయతీ సెక్రటరీ రజనీకాంత్‌రెడ్డి, కారోబారి విజేశ్‌లు బోర్‌వెల్‌కు మరమ్మతులు చేయించారు.

చింతలమానెపల్లి తహసీల్దార్‌గా మునావర్ షరీఫ్

చింతలమానెపల్లి: మండల తహసీల్దార్‌గా మునావర్ షరీఫ్ నియమితులయ్యారు. మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజుగౌడ్ బదిలీ కాగా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మునావర్ షరీఫ్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ ఆయన మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.

పోలీసుల ఆధ్వర్యంలో ఉద్యోగమేళా

సిర్పూర్(టి): మండలంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన యువతీ, యువకుల సౌకర్యార్థం మండల పోలీసుల ఆధ్వర్యంలో వివిధ ప్రైవేటు కంపెనీల సహకారంతో త్వరలో ఉద్యోగమేళా నిర్వహిస్తామని ఎస్సై రమేశ్ తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, ఒరిస్సాలోని ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఉద్యోగమేళాలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

9న ఆదివాసీ దినోత్సవం



తాత్కాలిక కార్యనిర్వాహక కమిటీ సభ్యులు

బెజ్జూర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ సంక్షేమ సంఘం భవనంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం తాత్కాలిక కార్యనిర్వాహక కమిటీని నియమించారు.

అమ్మవారికి ఆషాఢ పూజలు



అమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

రెబ్బెన: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆషాఢం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: బీజేపీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో బీజేపీ కార్యకర్తల మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజలకు పార్టీ కార్యకర్తలు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు నారులే వాసు పటేల్, నాయకులు భీంరావు, మధుకర్, మిథున్, నానాజీ, సాయినాథ్, శ్రీకాంత్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటలు నీటిపాలు!

- ప్రాణహిత నది వరదలతో నీటమునిగిన పంటలు
- 500 ఎకరాల్లో పత్తి, వరి పంటలకు నష్టం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- పరిహారం అందించాలని అన్నదాత వేడుకోలు



మురళీగూడలో వరదలతో నష్టపోయిన పత్తి పంట

పెంచికల్‌పేట్: ప్రాణహిత, పెద్దవాగులకు వరద పోటెత్తడంతో పరీవాహక ప్రాంతాల్లోని మురళీగూడ, జిల్లెడ, నందిగామ గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తీవ్రంగా పంట నష్టం జరిగినా ప్రభుత్వం, అధికార యంత్రాంగం రైతుల వైపు కన్నెత్తి చూడటం లేదు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగు చేసిన పంటలు పూర్తిగా వరదలతో కొట్టుకుపోయినా పట్టించుకునే వారే కరువయ్యారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీగా నష్టం..

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత, పెద్దవాగులు ఉగ్రరూపం దాల్చడంతో మూడు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలు నాలుగు రోజులపాటు వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నెల రోజుల్లోనే పూర్తిగా దెబ్బతినడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. సుమారు 500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటల స్థానంలో వేరే పంటలు వేసే అవకాశం కూడా లేదని రైతులు వాపోతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



భారీ వరదలకు వందల ఎకరాల్లో పంటలు నష్టపోయినా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి వరకు గ్రామానికి రాలేదు. వారం రోజులుగా గ్రామ్పానికి సమీపంలో నీరు చేరినా ఎవరూ పట్టించుకోలేదు. వరదలతో ఆర్థికంగా నష్టపోయిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– దుర్గం ముత్తయ్య, రైతు, మురళీగూడ

పరిహారం అందజేయాలి



ఏటా వరదలతో పంట నష్టం జరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందడం లేదు. గ్రామంలో సాగు చేసిన 80శాతం పంటలు నష్టపోయినా ఇప్పటికీ అధికారులు కన్నెత్తి చూడలేదు. నష్టపోయిన పంట సర్వే నిర్వహించి రైతులకు పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దుర్గం నీలయ్య, రైతు, జిల్లెడ

జాతీయ రహదారి వెంట బస్‌షెల్టర్లు నిర్మించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం

రెబ్బెన: మండలంలోని తక్కళ్లపల్లి నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు జాతీయ రహదారి వెంట బస్‌షెల్టర్లు నిర్మించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. ఆదివారం రెబ్బెనలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెబ్బెన, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల మీదుగా 2019లో ప్రారంభించిన జాతీయ రహదారి నిర్మాణ పనులు ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. ఎక్స్‌రోడ్ల వద్ద, గ్రామాల్లో బస్‌షెల్టర్లు నిర్మించాల్సి ఉన్నా ఇప్పటివరకు నిర్మించకపోవటంతో ప్రయాణికులు వర్షానికి తడుస్తూ వాహనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. రోడ్డు నిర్మాణ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి సతీశ్, జిల్లా కమిటీ సభ్యులు శివ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు రూ. 26వేల వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని పంచాయతీ కార్మికులు సభకు అధిక సంఖ్యలో హాజరై పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మోరేశ్వర్, నాగేశ్, ప్రకాశ్, నాని, శంకర్, గణపతి, బానిత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



చింతలమానెపల్లి: బోనాల పండుగలో పాల్గొన్న మహిళలు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. గ్రామంలోని బారెగూడ నుంచి పోచమ్మ ఆలయం వరకు మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. పోచమ్మ ఆలయంలో బోనాలతో మొక్కుకున్నారు. పాడి పంటలు సంవృద్ధిగా పండాలని, తమ కుటుంబాలను చల్లగా చూడాలని ఏటా బోనాల పండుగ నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.



కౌటాల: బోనాలతో మహిళలు

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన భక్తులు ఆదివారం రేణుక ఎల్లమ్మ బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ మీదుగా రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. డప్పువాయిద్యాల నడుమ నెత్తిన బోనాలతో భక్తులు ఎల్లమ్మ ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం ఆలయంలో ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు సంవృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని తల్లిని కోరుకున్నారు. మాజీ ఎంపీపీ సౌందర్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, సంవృద్ధిగా పంటలు పండాలని పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు. మాజీ సర్పంచ్ మడావి రేణుక, భక్తులు పాల్గొన్నారు.



రెబ్బెన: నెత్తిన బోనాలతో ఎల్లమ్మ తల్లి ఆలయానికి తరలివెళ్తున్న భక్తులు



రెబ్బెన: బోనాలతో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద భక్తులు

పీవోకు అధికారాలు కల్పించాలి

జైనూర్: ఏజెన్సీలో సివిల్ కేసుల విచారణ, పోలీసుల నియంత్రణ అధికారం ఐటీడీఏ పీవోకు కల్పించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మెస్రం అంబాజీ, మెస్రం రాహుల్, దినేష్, చహక్కటి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కనక యాదవరావు

వృద్ధ దంపతులకు నిత్యావసరాల పంపిణీ

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామంలోని దుబ్బగూడెంకు చెందిన వృద్ధ దంపతులు సల్లూరి వీరమల్లు–లస్మక్క గుడిసె వర్షాలకు కూలిపోయి నిరాశ్రయులయ్యారు. దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ దాతల సాయం కోసం ఎదురుచూస్తున్న వృద్ధ దంపతుల దీన స్థితిపై 'వర్షాలకు కూలిన గుడిసె' అనే శీర్షికన ఈ నెల 26న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్ స్పందించి ఆదివారం వారికి రెండు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. వృద్ధుల దీన స్థితిని ప్రచురించి వారికి ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లేష్, శ్రీనివాస్, రాజం, వీరేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

కాంబ్లే నాందేవ్ సేవలు చిరస్మరణీయం

నార్నూర్: దళిత నేతగా, మాజీ డీసీసీబీ చైర్మన్‌గా ఏజెన్సీ దళితుల హక్కుల కోసం పోరాడిన కాంబ్లే నాందేవ్ సేవలు చిరస్మణీయమని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం గుంజాల గ్రామంలో కాంబ్లే నాందేవ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బానోత్ గజానంద్ నాయక్, రూప్‌దేవ్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కోర్రెల్లా మహేందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

- వన మహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు



తిర్యాణి: మొక్క నాటుతున్న అధికారులు

తిర్యాణి: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ జీవకోటి మనుగడ సాధించాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, గిన్నెదరి ఇన్‌చార్జి రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్, సెక్షన్ ఆఫీసర్ మహేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీ, అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండలంలోని రవీంద్రనగర్, చింతలమానెపల్లి, బాలాజీఅనుకోడ, గ్రామాలలో ఎంపీడీవో కోట ప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. డబ్బా సెక్షన్ పరిధిలో డిప్యూటీ రేంజ్ అధికారి బానేష్, ఖర్జెల్లి రేంజ్ పరిధిలో సెక్షన్ అధికారులు ఉజ్వల్, మోహన్, అటవీ సిబ్బంది మొక్కలు నాటారు. ఏపీవో గోవర్ధన్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది స్థానికులతో కలిసి వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎఫ్‌ఆర్‌వో పూర్ణచందర్, ఎస్సై దీకొండ రమేశ్‌లు మండలకేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి మొక్కల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అన్ని గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెబ్బెన: విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటడం ఒక అలవాటుగా మార్చుకోవాలని రెబ్బెన ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో శ్రీధరాచారి అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్క నాటితే భవిష్యత్తులో మహావనం తయారవుతుందన్నారు. ఆదివారం గంగాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శంకరమ్మ, సెక్షన్ అధికారి కొమ్మాలు, రవీందర్, ఫారెస్టు బీట్ అధికారులు స్వామి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో ఆదివారం బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ రావు హాజరయ్యారు. శిక్షణ బీట్ అధికారులను బెజ్జూర్ రేంజ్ పరిధిలోని అడవి ప్రాంతాన్ని రేంజ్ అధికారి దయాకర్, రామ్మోహన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వన్యప్రాణుల కదలికలు, పులుల పాదముద్రలు, రాముడు, భీముడు చెట్లను పరిశీలించారు. అడవిలో గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. అటవీ ప్రాంతంలో రకరకాల పక్షులు, వన్యప్రాణులు, అటవీ సంపద గురించి వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, ఈసీ రజనీకాంత్, తోటమాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, బీట్ అధికారి అనిత, గ్రామ కార్యదర్శి తుకారాం, నాయకులు సామల తిరుపతి, జావిద్ అలీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మొక్కలు మానవ మనుగడకు ఎంతో సహకరిస్తాయని జైనూర్ ఉపాధిహామీ ప్రత్యేకాధికారి నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలతో పాటు సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

లింగాపూర్: మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అటవీ సెక్షన్ అధికారి భగవంత్‌రావ్, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీలతో కలిసి మొక్కలు నాటారు.

దహెగాం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కల్వాడ గ్రామంలో మొక్కలు నాటారు. ఎస్సై రాజు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ప్రతి ఒక్కరూ నాలుగు మొక్కలు నాటాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని మినీ స్టేడియం, కౌటాల–బెజ్జూర్ ప్రధాన రహదారి ఇరువైపులా మొక్కలు నాటారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఎఫ్‌బీవో ప్రభాకర్, కార్యదర్శి కవిత, పాల్గొన్నారు.



జైనూర్‌లో..




లింగాపూర్‌లో..




చింతలమానెపల్లిలో..



రెబ్బెన: మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో, ఎంపీడీవో



బెజ్జూర్: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారి



సిర్పూర్(టి): వనమహోత్సవంలో పాల్గొన్న అధికారులు

కూలిన ఇంటి గోడ



కూలిన ఇంటి గోడ

దహెగాం: మండల కేంద్రానికి చెందిన గౌతురి తారా అనే మహిళకు చెందిన ఇంటి గోడ భారీ వర్షాలకు ఆదివారం కూలింది. గోడ కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పరిహారం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత మహిళ వేడుకున్నారు.